యదార్థవాది NEWS
తెలుగు దినపత్రిక

| https://yaadharthavaadhi.in సోమవారం, 27 నవంబర్ 2023

DIGITAL EDITION : TELANGANA, ANDHRA PRADESH

అమరావతికి ప్రియాంకాగాంధీ

● గేరు మార్చిన కాంగ్రెస్...!

యదార్థవాది ప్రతినిధి నవంబర్ 27 అమరావతి

ఏపీ కాంగ్రెస్ గేర్ మార్చింది. జోరు పెంచుతోంది. తెలంగాణాను చూసి ఏపీ కాంగ్రెస్ లో కూడా కదలిక వచ్చింది. ఏపీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు ఈ విషయంలో కాస్తా ముందున్నారు. ఆయన కాంగ్రెస్ అగ్ర నేత్రి ప్రియాంకా గాంధీని ఏపీకి రప్పించాలని చూస్తున్నారు. అలాగే రాహుల్ గాంధీని రప్పించాలని ఆయన భావిస్తున్నారు. నిజం చెప్పాలంటే రాహుల్ ప్రియాంక ఏపీ టూర్లు చాలా నెలల క్రితమే నిర్ణయించబడ్డాయి. కానీ అవి అంతకంతకు ఏదో కారణం వల్ల ఆలస్యం అవుతున్నాయి. ఇపుడు తెలంగాణా ఎన్నికల హడావుడిలో కాంగ్రెస్ ఉంది. ఆ పార్టీ అగ్ర నేతలు తెలంగాణలో పర్యటిస్తున్నారు. రాహుల్ ప్రియాంక క్షణం తీరిక లేకుండా బిజీగా ఉన్నారు.తెలంగాణాలో కాంగ్రెస్ కి అధికారం పక్కా అని కూడా వారు భావిస్తున్నారు. ఇక తెలంగాణా తరువాత ఏపీ మీదనే కాంగ్రెస్ పెద్దల ఫోకస్ ఉంటుంది అని అంటున్నారు. డిసెంబర్ 3న తెలంగాణా ఎన్నికల ఫలితాలు వస్తాయి. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఈ డిసెంబర్ రెండవ వారం నుంచే కాంగ్రెస్ హై కమాండ్ ఏపీ మీదనే ఫుల్ ఫోకస్ పెట్టనుంది అని అంటున్నారుఅదే విధంగా చూస్తే ప్రియాంకా గాంధీని ముందుగా ఏపీకి రప్పించాలని చూస్తున్నారు. అమరావతిని ఏపీకి ఏకైక రాజధానిగా ఉంచాలని కాంగ్రెస్ కూడా ఇతర విపక్షాలతో గొంతు కలిపింది. వైసీపీ మూడు రాజధానుల ప్రతిపాదనను కాంగ్రెస్ తప్పుపడుతోంది. దాంతో పాటు అమరావతిలో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు అండగా ఉంటామని కూడా చెబుతోంది.ఇక అమరావతిలోనే ప్రియాంకా గాంధీ భారీ బహిరంగ సభను నిర్వహించాలని కూడా ఏపీ కాంగ్రెస్ ఆలోచిస్తోంది. తెలంగాణా ఎన్నికల తరువాత కాంగ్రెస్ గ్రాఫ్ ఏపీలో పెంచాలన్న ఉద్దేశ్యంతో నిర్వహించే ఈ సభ మీద చాలా ఆశలనే అంతా పెట్టుకున్నారు.దీంతో ప్రియాంకా గాంధీ చాలా తొందరలోనే ఏపీ టూర్ చేయనున్నారు అని అంటున్నారు. ఈ మేరకు ఏపీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు ప్రియాంకా గాంధీకి ఒక లేఖ రాశారు. ఉమ్మడి ఏపీని రెండుగా విభజిస్తూ కాంగ్రెస్ నాడు యూపీయే హయాంలో నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఏపీ ప్రయోజనాలను పరిరక్షించడానికి విభజన చట్టాన్ని కూడా రూపొందించింది.అయితే ఈ చట్టాన్ని గత పదేళ్ళుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ మాత్రం అమలు చేయలేదని గిడుగు రుద్రరాజు ప్రియాంకాకు రాసిన లేఖలో పేర్కొన్నారు. అలాగే ఏపీని రెండు దఫాలుగా పాలించిన టీడీపీ వైసీపీ ప్రభుత్వాలు ఏమీ చేయలేదని కూడా ఆయన ఆరోపించారు. ఏపీని అన్ని విధాలుగా ఆదుకోవాల్సింది కాంగ్రెస్ మాత్రమే అని ఆయన అంటున్నారు. ఏపీకి ఈ రోజు దాకా రాజధాని లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని రుద్రరాజు అంటున్నారు. అందువల్ల పునర్ విభజన చట్టంలోని అంశాలను పూర్తిగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఏపీకి ఏకైక రాజధాని అమరావతి అని ఘంటాపథంతా కాంగ్రెస్ చెబుతూ ఆ విషయం మీద ఏపీ ప్రజలకు ఒక కీలక సందేశం ఇచ్చేలా అమరావతిలోనే భారీ సభను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది అని ఆయన వెల్లడించారు. ఆ సభకు ప్రియాంకా గాంధీ హాజరు కావాలని ఆయన కోరుతున్నారు.మరి ప్రియాంకా గాంధీ ఈ లేఖ తరువాత తన నిర్ణయం చెబుతారు అని అంటున్నారు. ఈ మీదట ఒక డేట్ ప్లేస్ ఫిక్స్ చేసి మరీ ప్రియాంకా గాంధీ తో భారీ సభకు కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్ చేస్తోంది. అమరావతి ఇష్యూతోనే ఏపీలో ఎంటర్ కావాలని కాంగ్రెస్ చూస్తోంది. అదే విధంగా రాహుల్ గాంధీని విశాఖ రప్పించి స్టీల్ ప్లాంట్ ఉద్యమాన్ని ఉధృతం చేసే ఆలోచనలో కాంగ్రెస్ ఉంది. ఏది ఏమైనా డిసెంబర్ 3 తరువాత ఏపీ మీదనే కాంగ్రెస్ చూపు ఉంటుందని అంటున్నారు.

టీడీపీ జనసేన పొత్తులో త్యాగరాజులయ్యేది ఎవరు...?

యదార్థవాది ప్రతినిధి నవంబర్ 27అమరావతి



తెలుగుదేశం జనసేన పొత్తు కుదిరింది. అగ్ర నేత లు అంతా బాగా సంతోషిస్తున్నారు. టీడీపీ నేతల ఆనందం అయితే చాలా ఎక్కువ గా ఉంది. ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ టూర్ పెట్టుకున్నారు. ఆయన రెండు రోజులు స్మార్ట్ సిటీలో గడిపారు. ఈ సందర్భంగా ఒక హొ టల్ లో పవన్ని విశాఖ జిల్లాకు చెందిన టీడీపీ అగ్ర నాయకులు అంతా కలిశారు. పవన్ కూడా వారితో హు షారు చేస్తూ మాటా మంతీ పెట్టారు. టీడీపీ నాయకులు తీరు కొత్త అనుభవంగా ఉంది అని అంటున్నారు. చంద్రబాబు వచ్చినపుడు మాత్రమే టీడీపీ నాయకులు అంతా వెళ్ళి ఆ యన్ని కలుస్తూ ఉంటారు. అలాంటిది మిత్రపక్షం నేత పవన్ వస్తే కట్టకట్టుకుని అంతా కలవ డం అంటే టీడీపీ జనసేన పొత్తు పట్ల ఎంతటి జోష్ తో ఉందో అర్థం అవుతోంది అని అంటు న్నారు.అదే టైంలో పవన్ మనసులో మాటను తెలుసుకునేందుకు పొత్తు సీట్లలో తమవి పో కుండా ఉండేలా చూసుకునేందుకు కూడా కొం దరు తమ్ముళ్ళు ఇ లా వ్యవహరించారు అని అం టున్నారు. జనసేన ముందరి కాళ్ళకు బంధం వేసేలా కూడా తమ్ముళ్ళు కొందరు పవన్ తో మా నియోజ కవర్గాలలో మీరు ప్రచారం చేయాలని కోరారని అంటున్నారు.అంటే టీడీపీ తరపున తా మే అక్కడ అభ్యర్థులుగా ఉంటామని ఇండైరెక్ట్ గా చెప్పకనే చెబుతున్నారు అని అంటున్నారు. ఇక టీడీపీ నేతలతో పవన్ మాట్లాడుతూ ఏపీ వి శాల ప్రయోజనాల రిత్యా యువ త ఆశలు ఆ కాంక్షల రిత్యా అంతా కలసి ముందుకు సాగాల ని పదవులు సమస్య కారాదని అన్నట్లు గా టీడీపీ అనుకూల మీడియాలో వార్తలు వచ్చా యి.పవన్ అన్నది ఏంటి ఆయన ఉద్దేశ్యం ఏంటి అన్నది పక్కన పెడితే జనసేన తానుగా సీట్లు త్యాగం చేస్తుంది అన్నట్లుగానే అర్థం వచ్చేలా ప్ర చారం మొదలైంది అని అంటున్నా రు. నిజానికి టీడీపీ పొత్తు ద్వారా కనీసంగా యాభై సీట్ల దాకా జనసేన డిమాండ్ చేస్తుంది అని వార్తలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ముప్పై సీట్లకు తగ్గకుండా జనసేన పోటీ చేస్తుంది అని కూడా మరో వైపు అంటున్న వారూ ఉన్నారు.ఇవన్నీ పక్కన పెడితే ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేనకు కనీసంగా అరడజన్ సీట్ల మీద కన్ను ఉందని అంటున్నారు. అందులో బిగ్ షాట్స్ తో పాటు కీలక నేతల నియోజకవర్గాలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే ఆ యా సీట్లలో పోటీకి తయారుగా ఉన్న టీడీపీ నేతలు కీలక నాయ కులు అంతా పవన్ తో కలసి మీటింగులో ఉన్నారు.దీంతో తమ నియోజకవర్గాలకు పొత్తు ద్వారా సీట్లు పోవని వారి అనుచరులు గట్టిగా చెప్పుకుంటున్నారు. మరి ఎవరి సీట్లూ పోకపోతే జనసేన కేవలం ప్రచారానికేనా అన్న డౌట్లు వస్తున్నాయి. జనసేనకు విశాఖ లో ఆరేడు నియోజకవర్గాలలో మంచి బలం ఉందని అంటున్నా రు. 2019 ఎన్నికల్లో పాతిక వేల దాకా ఓట్లు వచ్చిన నియోజకవ ర్గాలు ఉన్నాయని వాటిలో మళ్లీ జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖ నార్త్, గాజువాక, భీమిలీ, పెందుర్తి, ఎలమంచిలి. అనకాపల్లిలలో జనసేన కచ్చితంగా పోటీ చేస్తుంది అని అంటున్నారు. మరి ఇక్కడ టీడీపీ నుంచి పోటీలో మాజీ మంత్రులు సీనియర్ నేతలు ఉన్నారు. పవన్ చెప్పింది పదవులు వదులుకోవాలన్నది రెండు వైపుల నుంచి అని అంటున్న వారు ఉన్నారు. అయితే జనసేన త్యాగం చేస్తుందని ప్రచారం సాగడమే చిత్రం. మరి ఎన్నికల్లో సీట్ల షేరింగ్ ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది అంటున్నారు.

రైతుబంధును ఆపేయడంపై హరీశ్ రావు స్పందన

●కాంగ్రెస్ పార్టీ కుట్ర మరోసారి బయటపడిందన్న మంత్రి ● పంపిణీకి అనుమతిచ్చాక కూడా మళ్లీ ఫిర్యాదు ●కాంగ్రెస్ లీడర్ నిరంజన్ ఫిర్యాదు వల్లే ఈసీ నిర్ణయం

యదార్థవాది ప్రతినిధి నవంబర్ 26 తెలంగాణ



రైతుబంధు పంపిణీని నిలిపేయాలంటూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన తాజా ఆదేశాలపై మంత్రి హరీశ్ రావు స్పందించారు. తెలంగాణ రైతులపై, రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ కుట్ర మరోసారి బయ టపడిందని అన్నారు. రైతన్నలకు సాయం అందకుండా కుట్ర పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బంధు పంపిణీ చేయొచ్చంటూ ఈసీ అనుమతిచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ తన దుర్బుద్ధిని వదులు కోలేదని మండిపడ్డారు. టీపీసీసీ ఎన్నికల కమిటీ చైర్మన్ నిరంజన్ ఫిర్యాదు చేయడం వల్లే రైతుబంధు పంపిణీని నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని ఆరోపించారు.రైతుబంధును కాంగ్రెస్ పార్టీ ఆపిందనడానికి ఇంతకంటే సాక్ష్యం అవసరంలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలను అర్థం చేసుకో వాలంటూ తెలంగాణ ప్రజలు, రైతులకు మంత్రి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. కాగా, ఎన్నికల ప్రచారం లో రైతుబంధు పంపిణీ చేయనున్నట్లు మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలతోనే రైతుబంధుకు ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

ఎగ్జిట్ పోల్ ఫలితాలపై ఈసీ బ్యాన్.. 30 వరకు అంతే!

యదార్థవాది ప్రతినిధి నవంబర్ 26 తెలంగాణ

ఈ నెల 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తయ్యే వరకు కూడా ఎవరూ ఎగ్జిట పోల్స్‌ను వెల్లడించవద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందితెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు? ఎవరు మెజారిటీ దక్కించుకుంటారు? ఎవరు ఓడతారు? అసలు ఏం జరుగుతుంది? ప్రజానాడి ఎలా ఉంది? అనే అంశాలు ఆసక్తికరమే. అయితే.. ఇప్పటి వరకు ఏం జరిగినా.. ఇక నుంచి ఆయా వివరాలపై సర్వే ఫలితాలు వెల్లడించరాదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. టీవీలు, సోషల్ మీడియా, పత్రికలు సహా ఏ ప్రసార మాధ్యమాల్లోనూ ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడించరాదని తాజాగా ఆదేశాలు జారీ చేసింది.ఈ నెల 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తయ్యే వరకు కూడా ఎవరూ ఎగ్జిట్‌పోల్స్‌ను వెల్లడించవద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని క్లాజ్ 126(ఏ) ప్రకారం.. ఈ నిబంధనను అమలు చేస్తున్నట్టు పేర్కొంది. ఎన్నికలకు సంబంధించిన ఏ అంశమైనా ప్రచురించేందుకు, ప్రసారం చేసేందుకు, వైరల్ చేసేందుకు.. ఈ చట్టం అనుమతించబోదని పేర్కొంది.ఓటర్లను ప్రభావితం చేసేలా ఉండే అన్ని అంశాలను.. నిషేధిస్తున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. ఓటింగ్ ప్రక్రియ సజావుగా, సక్రమంగా.. ఎలాంటి ప్రలోభాలు లేకుండా నిర్వహించేందుకే ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. ఇదిలావుంటే.. తెలంగాణలో ఇప్పటి వరకు అనేక సర్వేలు వచ్చాయి. అధికార బీఆర్ ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని.. సర్వేలు వెల్లడించినా.. ఏ పార్టీకీ పూర్తిస్థాయిలో అధికారం కట్టబెట్టే పరిస్థితి లేదని తేల్చి చెప్పాయి. ఈ నేపథ్యంలో వచ్చే మూడు రోజుల ప్రచారం మరింత తీవ్రతరం కానుంది. ఈ క్రమంలోనే సర్వేలపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం గమనార్హం.

హైదరాబాద్ శివార్లలో బస్సు బోల్తా 20 మందికి గాయాలు

● అదుపుతప్పి హైవేపై బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

●దాదాపు 10 కి.మీ. మేర నిలిచిన ట్రాఫిక్

●నిలకడగా ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితి

యదార్థవాది ప్రతినిధి నవంబర్ 26 తెలంగాణ

షాద్ నగర్ మీదుగా హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు యాక్సిడెంట్ కు గురైంది. జాతీయ రహదారిపై దూసుకెళ్తున్న బస్సు ఉన్నట్టుండి అదుపుతప్పింది. డివైడర్ ను ఢీ కొట్టి రోడ్డుకు అవతలివైపుకు దూసుకెళ్లింది. వేగం ఎక్కువగా ఉండడంతో బోల్తాపడింది. దీంతో బస్సులోని డ్రైవర్, కండక్టర్లతో పాటు మొత్తం 20 మంది గాయపడ్డారు. అయితే, ఆ సమయంలో ట్రాఫిక్ తక్కువగా ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు చెప్పారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారికి చికిత్స అందిస్తున్నామని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. రోడ్డుపై బస్సు బోల్తా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా.. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ ను క్లియర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

తెలంగాణలో ఉన్న సీమాంధ్రులకు ఇదే నా విన్నపం: పోసాని కృష్ణమురళి

● సెటిలర్లను కేసీఆర్ కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారన్న పోసాని ● తెలంగాణలో రెండు రాష్ట్రాల వారు అన్నదమ్ముల్లా ఉన్నారని వ్యాఖ్య ● అందరూ బీఆర్ఎస్ కి ఓటు వేసి కేసీఆర్ ను మరోసారి సీఎం చేసుకోవాలని విన్నపం

యదార్థవాది ప్రతినిధి నవంబర్ 26 తెలంగాణ

తెలంగాణలో ఉన్న సీమాంధ్ర ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి కొనియాడారు. రాష్ట్రంలో ఏపీ, తెలంగాణ ప్రజలంతా కలిసిమెలిసి అన్నదమ్ముల్లా ఉన్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పుంతలు తొక్కుతోందని ప్రశంసించారు. తక్కువ కాలంలోనే న్యూయార్క్ ను తలదన్నేలా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. మిషన్ భగీరథ గురించి ఎంత చెప్పినా తక్కువేనని... నెహ్రూ నుంచి ఈరోజు వరకు ఏ ప్రధాని కూడా ఇంత గొప్ప కార్యక్రమం చేయలేదని పోసాని అన్నారు. రాష్ట్రంలో ఏ ట్యాప్ తిప్పినా తాగు నీరు వస్తోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని అంటున్నారే కానీ... అవినీతి ఎక్కడ జరిగిందనేని ఇంతవరకు నిరూపించలేకపోయారని విమర్శించారు. మేడి గడ్డ బ్యారేజీలో ఒక్క పిల్లర్ కుంగిపోతే ఊళ్లు ఎలా మునిగిపోతాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో చెరువులన్నీ నీటి కళను సంతరించుకున్నాయని... ఎక్కడ చూసినా పచ్చటి పంట పొలాలు కనిపిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న సెటిలర్స్ ను కేసీఆర్ బిడ్డల మాదిరి చూసుకుంటున్నారని పోసాని అన్నారు. తెలంగాణలో ఉన్న సీమాంధ్రులకు తన విన్నపం ఒక్కటేనని... కులమతాలకు అతీతంగా ఆలోచించి, మనల్ని కాపాడుతున్నది ఎవరనే విషయాన్ని ఆలోచించాలని చెప్పారు. అందరూ బీఆర్ఎస్ కు ఓటు వేసి కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

కేసీఆర్ ను వేటాడేందుకే కామారెడ్డిలో పోటీ చేస్తున్నా: రేవంత్ రెడ్డి

●కామారెడ్డి ప్రజల తీర్పు చరిత్రలో నిలిచిపోతుందన్న టీపీసీసీ చీఫ్ ●అమ్మగారి ఊరు కేసీఆర్ కు 40 ఏళ్ల తర్వాత గుర్తొచ్చిందంటూ ఎద్దేవా ●కామారెడ్డి భూములను మింగేందుకే ఇక్కడికి వచ్చిండని ఆరోపణ

యదార్థవాది ప్రతినిధి నవంబర్ 26 తెలంగాణ

గడిచిన నలభై ఏళ్లుగా గుర్తురాని అమ్మగారి ఊరు కేసీఆర్ కు ఇప్పుడు గుర్తొచ్చిందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇన్నేళ్లలో గల్ఫ్ కార్మికుల గోసను ఏనాడూ ఆయన పట్టించుకోలేదని మండిపడ్డారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాలను పరామర్శించేందుకు కేసీఆర్ కు తీరికే దొరకలేదని అన్నారు. ఇప్పుడు ఆయన కామారెడ్డికి వచ్చింది ప్రజల కోసం కాదని, ఇక్కడున్న భూములను కాజేసేందుకే వచ్చాడని ఆరోపించారు.పేదల రక్తం రుచి మరిగిన కేసీఆర్ ను వేటాడేందుకే తాను కామారెడ్డిలో పోటీ చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన తెలంగాణ ద్రోహి కేసీఆర్ ను ఈ ఎన్నికల్లో బొంద పెట్టాలని కామారెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చా రు. ఈ ఎన్నికల్లో కామారెడ్డి ప్రజలు ఇచ్చే తీ ర్పు చరిత్రలో నిలిచిపోతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ట్వీట్ చేశారు.